పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 420 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అన్ని కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా వసతులు కల్పించాలన్నారు. అవసరమైన గన్నీ బ్యాగులు సిద్ధం చేసుకోవాలని రెండు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. వ్యవసాయాధికారులు ధ్రువీకరించిన తర్వాతే తూకం వేయాలన్నారు. సన్నరకం ధాన్యం కొనుగోలుకు 63 కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రత్యేకంగా వ్యవసాయ విస్తరణ అధికారులను ట్యాగింగ్ చేయాలన్నారు. సన్నరకం ధాన్యం గుర్తించేందుకు డయల్ కాలిపర్ డివైస్ తెప్పించాలని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. 2023-24 ఖరీఫ్, రబీ సీజనుకు సంబంధించి కస్టం మిల్లింగ్ బియ్యాన్ని ఈనెల 31లోగా రికవరీ చేయాలన్నారు. బియ్యం నిల్వలకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని పూర్తిస్థాయిలో బియ్యం రికవరీ చేసే ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీసీఎస్ఓ ఎస్.జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

పంట ఉత్పత్తుల రక్షణ చర్యలు తీసుకోవాలి

జగిత్యాల వ్యవసాయం: రాగల నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి అక్కడక్కడ ఓ మోస్తరు వర్షసూచన ఉన్నందున రైతులు తమ పంట ఉత్పత్తుల రక్షణ చర్యలు తీసుకోవాలని పొలాస పరిశోధనస్థానం ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ సూచించారు. గాలిలోతేమ 53-93 శాతం, ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

అధ్యయనంతో.. ఉత్తమ గ్రేడ్లు



పది విద్యార్థులకు విషయ నిపుణుల సూచనలు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

పాఠశాల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు అత్యంత కీలకం. ఇప్పటి నుంచే ఉత్తమ గ్రేడ్‌లు సాధించేందుకు ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఆశించిన ఫలితాల కోసం సాధన చేస్తున్నా.. వారిలో ఎక్కడో ఒకింత పాఠ్యాంశాలు, సన్నద్ధతపై ఆందోళన, సందేహాలు ఉన్నాయి. గణితం, సామాన్యశాస్త్రంతోపాటు భాషా అంశాలు, సాంఘిక శాస్త్రం ప్రణాళికతో చదివితే విద్యార్థులు ఉత్తమ గ్రేడ్‌లు సాధించవచ్చు. పదో తరగతిలో భాషా అంశాల్లో ఉత్తమ గ్రేడ్‌ల సాధనకు సన్నద్ధత, ప్రణాళికపై విషయ నిపుణుల సూచనలతో ‘న్యూస్‌టుడే’ కథనం.


పెద్దపల్లి జిల్లా పోతారం జడ్పీ ఉన్నత పాఠశాలలో సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

నిత్యాభ్యసనంతో తెలుగు సులువు


గాజుల రవీందర్, పాఠ్యపుస్తక రచయిత, కరీంనగర్

నిత్య అభ్యసనం ద్వారా తెలుగులో ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. 12 పాఠాలు, ఉపవాచకంలోని ఆరు ఖండాలు విభజించుకుని ఏ రోజు ఏం చదవాలో నిర్ణయించుకోవాలి. కష్టమైన అంశాలను గుర్తించి వాటిపై దృష్టి పెట్టాలి. ● అన్ని పాఠాల కవి పరిచయాలను క్షుణ్నంగా అర్థం చేసుకుని చదవాలి. తరచూ వాటిని చూడకుండా రాస్తూ తప్పు ఒప్పులను గుర్తించాలి. ● పరిచిత పద్యం కోసం ముఖ్యమైన 17 పద్యాలను జ్ఞాపకం ఉంచుకోవాలి. ● స్వీయరచన ప్రశ్నలకు అనుగుణంగా జవాబు రాసేలా సాధన చేస్తూ ఉండాలి. దానశీలం, వీర తెలంగాణ, కొత్త బాట, భాగ్యోదయం, శతక మధురిమ, గోల్కొండ పట్టణం, భిక్ష, భూమిక పాఠాలపై ప్రత్యేక దృష్టి నిలపాలి. ● అవగాహన, ప్రతిస్పందనకు సంబంధించిన పరిచిత అపరిచిత గద్యాంశాలకు సంబంధించిన పేరాలను ఒకటికి రెండు సార్లు చదివి వాటిల్లో చెప్పిన అంశం ఏమిటి? దేనికి సంబంధించింది? ఎందుకోసం ఉద్దేశించింది అనే ప్రశ్నలు విద్యార్థులు వేసుకుని పూర్తిస్థాయిలో వాటిపై అవగాహన పెంచుకోవాలి. ● పాఠ్యాంశాల్లోని బాక్స్ ప్రశ్నలు, అభ్యాసాలలోని ప్రశ్నలు, వాటి స్వభావంపై పూర్తి స్థాయి అవగాహన ఉండాలి. ● పరీక్షలో జవాబులను క్రమపద్ధతిలో వాక్య నిర్మాణ క్రమాన్ని పాటిస్తూ అక్షర దోషాలు లేకుండా రాసేలా తరచూ సాధన చేయాలి. ● సృజనాత్మకత ప్రశ్నల్లో లేఖ, సంభాషణ, కరపత్రం, కవిత, గేయం, ఆహ్వాన పత్రిక, ఆత్మకథ, నినాదాలు, సూక్తులు, అభినందన వ్యాసం, అభినందన పత్రం, ఇంటర్వ్యూ ప్రశ్నలు, వ్యాసం వంటి ప్రక్రియలపై అవగాహన ఉండాలి. ● పాఠాల చివరన వ్యాకరణాంశాలతోపాటు పుస్తకం చివరలోని పద పట్టిక నిఘంటువును తరచూ చదవాలి. ● అక్షర, అన్వయ దోషాలు లేకుండా.. వాక్య నిర్మాణం సరిగ్గా ఉండేలా పరీక్షల్లో జవాబులు రాయాలి.

హిందీ నమూనా ప్రశ్నపత్రాల సాధన ముఖ్యం


షరీఫ్ అహ్మద్, హిందీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్, కరీంనగర్

● పాఠాల్లోని భావాలు పూర్తిగా అర్థం చేసుకొని సమాధానాలు రాయడం అలవాటు చేసుకోవాలి. నమూనా ప్రశ్నపత్రాలను తరచూ సాధన చేయాలి.
● అపఠిత్ గద్యాంశ్‌కు సంబంధించి పాఠ్య పుస్తకంలోనివి కాకుండా హిందీ కథలు, వ్యాసాలు చదవాలి.
● పద్య భాగంలో వాడిన పదాలు, శైలి, అభివ్యక్తి గుర్తింపుపై సాధన చేయాలి. కవి గురించి తెలుసుకోవాలి. ● అర్థ్ గ్రాహ్యత- ప్రతిక్రియలో అక్షర దోషాలు లేకుండా క్రమం తప్పకుండా శాస్త్రీయ సమాధానాలు రాయాలి. ఒకటి రెండు వాక్యాల్లో సమాధానం రాయాలి. ● వర్తనీ దోషాలు లేకుండా నిత్యం కొన్ని పదాలను రాయడం అలవాటు చేసుకోవాలి. అల్పప్రాణ్, మహాప్రాణ్ ధ్వనులు, ఎక్కువగా ఉచ్చరించే అక్షరాల మధ్య తేడాలు తెలుసుకోవాలి.

ప్రణాళికతో ఆంగ్లంలో మంచి ఫలితాలు


జి.సురేందర్ మోహన్, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, జడ్పీ ఉన్నత పాఠశాల, నాగులమల్యాల

విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్లం పాఠ్యాంశాలు ప్రణాళికతో చదివితే ఉత్తమ జీపీఏ సాధించడం సులభం. పరీక్షల్లో ఎక్కువగా డిస్కోర్స్, క్లోజ్ టెస్ట్, గ్రామర్, అన్‌సీన్ పోయెమ్స్ అడుగుతారు. వీటిని విద్యార్థులు ఒకేసారి చదవకుండా ఒక్కో భాగాన్ని ఒక్కో సారి చదివితే ప్రణాళిక వేసుకోవాలి. ● ప్రశ్నపత్రంలోని 1-8 వరకు ఉన్న ప్రశ్నల్లో 1-4 రీడింగ్ ఎ నుంచి, 5-8 రీడింగ్ బి, సి నుంచి అడుగుతారు. ఇందుకోసం పుస్తకంలోని అన్ని పాఠాలను క్షుణ్నంగా అర్థం చేసుకోవాలి. ప్రశ్నలకు సమాధానాలు సూటిగా, అర్థవంతంగా రాయాలి. ఇందుకు మాదిరి ప్రశ్నలపై అవగాహన పెంచుకోవాలి. ఒక పేరాలో కొన్ని ప్రశ్నలను తరగతి ఉపాధ్యాయుడి ద్వారా తయారు చేయించుకుని ఒక్కో ప్రశ్నకు రెండు మూడు జవాబులు రాసి ఉపాధ్యాయులతో సరిచేయించుకునే పద్ధతిని ప్రాక్టీస్ చేయాలి. ● 9-12 వరకు గల ప్రశ్నల్లో బార్ (గ్రాఫిక్), పై చార్ట్, (గ్రాఫిక్) టేబుల్ వంటి వాటి నుంచి అడుగుతారు. కొన్నిసార్లు ఇచ్చిన టేబుల్ లేదా గ్రాఫ్ గురించి అడుగుతారు కాబట్టి జవాబులు ఆ ప్రశ్నల్లోనే ఉంటాయని గుర్తుంచుకోవాలి. ప్రశ్నలు హేతుబద్ధంగా ఉంటాయి కాబట్టి ఆలోచించి జవాబు రాసేలా సన్నద్ధం కావాలి. ● పేరాగ్రాఫ్ ఆధారంగా జవాబులు రాయడంలో వ్యాకరణ అంశాలు ఉంటాయి. గత ప్రశ్నపత్రాలు చూస్తే వాయిస్, స్పీచ్, క్వశ్చన్ ట్యాగ్స్‌పై ప్రతి సారి ప్రశ్నలు వస్తున్నాయి. వాటిల్లో చాలా రకాలు ఉంటాయి కాబట్టి ఒక్కో రకాన్ని ఒక్కో రోజు ప్రాక్టీస్ చేస్తూ ఉండాలి.
● డిస్కోర్సెస్ ప్రశ్నలను విద్యార్థులు ఎంత బాగా రాయగలిగితే అన్ని మార్కులు వస్తాయి. ఇందు కోసం వాటిపై ఇప్పటి నుంచే రాయడం అలవాటు చేసుకోవాలి. రాత నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. ● పార్ట్-బిలో అన్‌సీన్ పద్యాలు, గద్యభాగం (ప్రోజ్), క్లోజ్ టెస్ట్, ఎడిటింగ్ వంటి వాటిపై ప్రశ్నలు అడుగుతారు. అన్‌సీన్ పద్యం, ప్రోజ్‌లను క్షుణ్నంగా అర్థం చేసుకుంటే జవాబులు రాయవచ్చు. ఇందుకోసం కొన్ని అన్‌సీన్ పద్యాలు, ప్రోజ్‌లను అంతర్జాలంలో సేకరించి చదువుకోవాలి. ● ఎడిటింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు పాఠ్యపుస్తకం నుంచే ఇస్తారు. కాబట్టి పుస్తకంలోని అన్ని పాఠాలను క్షుణ్నంగా చదవాలి. ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్, టెన్సెస్, లింకర్స్, పర్యాయపదాలు, వ్యతిరేక పదాలు, అర్థాలపై ధ్యాస నిలపాలి. ● విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్ల భాషలో రాయడం, చదివి అర్థం చేసుకునే నైపుణ్యాలను పెంచుకోవాలి. ప్రశ్నలను చదివి అర్థం చేసుకునే సామర్థ్యం కలిగి ఉండాలి.

సాంఘికశాస్త్రంలో సమకాలీన అంశాలపై ప్రశ్నలు


ఎ.కుమారస్వామి, రిసోర్స్ పర్సన్, కరీంనగర్

సాంఘిక శాస్త్రంలోని 21 అధ్యాయాలను విద్యార్థులు ఇప్పటి నుంచే అవగాహన, ప్రణాళికతో చదివితే ఉత్తమ గ్రేడ్‌లు సాధించవచ్చు. చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలి.
● పాఠ్యాంశంలో చర్చించిన విషయాల ఆధారంగా ప్రస్తుత సమకాలీన అంశాలపై ప్రశ్నలు వస్తాయి. అందుకని లింగ వివక్ష, బాలికల విద్య, పర్యావరణం, భూగర్భ జలాలు, వలసలు, పట్టణీకరణ, సేంద్రియ ఎరువులు, భూగోళం వేడెక్కడం, ప్రపంచ శాంతి, ఓటు ప్రాధాన్యం, ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
● భారతదేశ చిత్రపటంలో రాష్ట్రాలు- రాజధానులు, భూ స్వరూపాలు, నదులు.. ప్రపంచ పటంలో ప్రముఖ ప్రదేశాలు, ఆయా దేశాలు, వాటి రాజధానులను గుర్తించేలా సాధన చేయాలి.
● తెలంగాణ రాష్ట్ర చిత్రపటం గీయడం సాధన చేయాలి.
● సమాచార నైపుణ్యం కింద ప్రశ్నలను పుస్తకంలోని 2, 3, 6, 8, 10, 12, 15, 19, 21 అధ్యాయాల్లో గ్రాఫులు, పట్టికల విశ్లేషణతో అధ్యయనం చేయాలి. దత్తాంశ విశ్లేషణ, సూచనలు ఆధారంగా సమాధానాలు రాయడం నేర్చుకోవాలి.
● ప్రణాళికతో విద్యా ప్రమాణాల ఆధారంగా వివిధ ప్రశ్నలకు సమాధానాలు రాసేప్పుడు సూచనలు పాటిస్తూ రాయడాన్ని అలవాటు చేసుకోవాలి. ఎస్‌సీఈఆర్టీ సాంఘికశాస్త్ర అభ్యాసన దీపికలను అధ్యయనం చేయడం ద్వారా ఎక్కువ మార్కులు సాధించవచ్చు.

జిల్లా ఔషధ కేంద్రం తనిఖీ

జగిత్యాల పట్టణం: జిల్లా ఔషధ కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఎం.డి.షమియొద్దీన్ శనివారం తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించి కేంద్రంలో రిఫ్రిజిరేటర్ల వినియోగంపై సిబ్బందిని ప్రశ్నించారు. మూడు నెలలకు సరిపడా మందుల నిల్వలను ఉంచాలని జిల్లాలోని చిన్నారులకు అవసరమైన వ్యాక్సిన్ కూడా అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. శ్రీనివాస్, గిరిధర్, జంషద్‌అలీ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి 14 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం వరకు 14,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా స్పిల్‌వే గేట్లను మూసివేశారు.

టెండర్లలో మాయాజాలం



■ తక్కువ ధరకే లీజు హక్కులు పొందుతున్న వ్యాపారులు

న్యూస్‌టుడే, మల్యాల

కొండగట్టు ఆలయంలో జరుగుతున్న అక్రమాలకు తోడు కొందరు నాయకులు, గుత్తేదారులు టెండర్లను తక్కువ ధరకు దక్కించుకొని ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారు. అంజన్న ఆలయానికి వచ్చే భక్తుల్లో చాలా మంది తలనీలాలు సమర్పించుకొని మొక్కు చెల్లించుకొని వెళ్తుంటారు. తలనీలాల సేకరణకు ఆలయ అధికారులు ఏటా టెండర్లు నిర్వహిస్తుంటారు. ఈ-వేలం, సీల్డ్‌టెండరు, బహిరంగ వేలం నిర్వహిస్తున్నా కొందరు వ్యాపారులు కుమ్మక్కవుతూ తక్కువ ధరకు పొందేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. వ్యాపారంతో సంబంధంలేని కొందరు నాయకులు కూడా టెండర్లలో పాల్గొంటారు. టెండరు పొందిన తర్వాత ఎక్కువ ధరకు విక్రయించి లక్షల్లో దండుకుంటున్నారు.

2021లో కిలోకు రూ.17,700

2019లో తలనీలాల సేకరణను గుత్తేదారు రూ.3.90 కోట్లకు దక్కించుకున్నాడు. తర్వాత సదరు వ్యాపారి ఆలయానికి రూ.97.50 లక్షలు చెల్లించి మధ్యలోనే వదిలివెళ్లడంతో ఆలయం తరపున సిబ్బంది తలనీలాలను సేకరించారు. పోగైన వాటిని 2021లో విక్రయించేందుకు వేలం వేయగా ఓ టెండరుదారు కిలోకు రూ.17,700 చెల్లించి తీసుకెళ్లారు. ఈ విధంగా ఆలయానికి రూ.1.15కోట్ల ఆదాయం సమకూరింది. 2021-22లో నిర్వహించిన వేలం ద్వారా రూ.1.43 కోట్లు ఆదాయం సమకూరింది.

■ రెండేళ్ల కిందట తలనీలాల సేకరణకు గుత్తేదారు రూ.3.65 కోట్లతో దక్కించుకున్నారు. వెంట్రుకలు సేకరించుకునే కాల పరిమితి 31 జులై 2023కు ముగియడంతో అధికారులు ఈనెల 17న పదోసారి వేలం నిర్వహించారు. ఓ గుత్తేదారు ఏడాదిపాటు సేకరణకు రూ.1.80 కోట్లు చెల్లించేందుకు ముందుకు రాగా ఏడాది నుంచి ఆలయం తరపున సేకరించిన తలనీలాల కొనుగోలుకు మరో గుత్తేదారు కిలోకు రూ.10,300 చెల్లించేందుకు టెండరు వేశారు.


తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు (పాత చిత్రం)

అనుమతి వస్తేనే అప్పగిస్తాం

దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన టెండర్లలో ఏడాది పాటు తలనీలాల సేకరణకు రూ.1.80 కోట్లకు, ఆలయం తరపున సేకరించిన తలనీలాలు కిలోకు రూ.10,300 చెల్లించేందుకు గుత్తేదారులు ముందుకు వచ్చారు. గతంలో వచ్చిన ధర కంటే తక్కువగా వచ్చినప్పటికీ ఇప్పటి వరకు పదిసార్లు టెండర్లు నిర్వహించాం. పత్రికల్లో ప్రకటనలకు రూ.లక్షల్లో ఖర్చవుతుంది. దేవాదాయశాఖ కమిషనరు అనుమతి ఉత్తర్వులు జారీచేస్తేనే గుత్తేదారులకు తలనీలాల సేకరణ అప్పగిస్తాం. **- రామకృష్ణారావు, ఈవో**



నవంబరు చివరి వారంలో విజ్ఞాన ప్రదర్శనలు

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: నవంబరు చివరి వారంలో రెండు జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి బి.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2024-25, ఇన్‌స్పైర్ 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయి ప్రదర్శన, ప్రాజెక్టు కాంపిటేషన్ పోటీలుంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ఈ పోటీలకు సన్నద్ధం చేయాలని సూచించారు. పోటీ విధానాలను డీఈవో వెల్లడించారు.

జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక్.. జిల్లాలోని అన్ని పాఠశాలలకు సంబంధించి 6 నుంచి 12 తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ముఖ్య అంశం ‘సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ టెక్నాలజీ’, ఉప అంశాలు 1-ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, 2-రవాణా కమ్యూనికేషన్, 3 సహజ వ్యవసాయం, 4-విపత్తు నిర్వహణ, 5-గణిత నమూనా, గణన ఆలోచన, 6-వ్యర్థాల నిర్వహణ, 7-వనరుల నిర్వహణ.

ఇన్‌స్పైర్ అవార్డుల.. జిల్లా నుంచి 2023-24 సంవత్సరానికి మొత్తం 60 ఇన్‌స్పైర్ అవార్డులు మంజూరయ్యాయి. వీరందరి సొంత ఖాతాల్లో రూ.10 వేల నగదు జమ చేశారు. ఇన్‌స్పైర్ అవార్డులకుగాను 60 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం. ఎంపికైన విద్యార్థి ప్రదర్శనలో పాల్గొనాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ 94402 12333లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

ముగిసిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

జగిత్యాల క్రీడావిభాగం : జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా 14, 17 ఏళ్ల లోపు విభాగంలో విజేతలుగా నిలిచిన బాల, బాలికలకు కళాశా ప్రిన్సిపల్ అశోక్ బహుమతులు, పతకాలు అందజేశారు. జిల్లా విద్యాధికారి బి.జగన్మోహన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.లక్ష్మీరామ్‌నాయక్, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు క్రిష్ణప్రసాద్, అంజయ్య, పుష్పలత, వెంకటలక్ష్మి, సాగర్, వేణు, భాస్కర్, గంగాసాగర్, కిశోర్, వేణు, ప్రశాంత్, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.


షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారుడు

క్రీడలతో మానసికోల్లాసం

జగిత్యాల, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం పోలీసు పరేడ్ మైదానంలో పోలీసులు, పాత్రికేయులతో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రికెట్ పోటీల నిర్వహణతో ప్రతి ఒక్కరికి ఆటవిడుపుతోపాటు టీం స్పిరిట్ వస్తుందన్నారు. పోలీసులు, పాత్రికేయుల మధ్య సమన్వయానికి ఇలాంటి పోటీలు దోహదపడుతాయని ఎస్పీ అన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా మహేష్ నిలువగా, బెస్ట్ బౌలర్‌గా ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్‌అలీఖాన్ నిలిచారు. డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి, సీఐలు సూరం వేణుగోపాల్, క్రిష్ణారెడ్డి, ఆరిఫ్‌అలీఖాన్, ఆర్.ఐ. వేణు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఆణిముత్యాలు

న్యూస్‌టుడే, కరీంనగర్ క్రీడా విభాగం

పరుగు పందెం.. నడక పోటీలు.. మారథాన్‌లు.. ట్రయాథ్లాన్.. స్టీపుల్ ఛేజ్.. పోటీలు ఏవైనా జిల్లా క్రీడాకారులు ప్రత్యర్థులను దాటి విజేతలుగా నిలిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వన్నె తెస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్నారు. గత సెప్టెంబరు 19, 20లలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో.. అక్టోబరు 7, 8లలో హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి ఛాంపియన్లుగా నిలిచారు. వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం



కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రాజయ్య-లక్ష్మిల కుమారుడు వినయ్ స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. లక్ష్మి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికురాలు. క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యంగా 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్, 1500, 5000 మీటర్ల పరుగు సాధన చేస్తున్నాడు.

■ 2023లో ఖమ్మంలో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్టీపుల్ ఛేజ్‌లో బంగారు పతకం, 5000 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించాడు. అదే ఏడాది సెప్టెంబరులో వరంగల్‌లో జరిగిన సౌత్‌జోన్ జాతీయ స్థాయి పరుగు పోటీల్లో 4వ స్థానంలో నిలిచాడు.

■ డిసెంబరులో కామారెడ్డిలో జరిగిన క్రాస్ కంట్రీ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ 8 కి.మీ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

■ 1500 మీటర్ల పరుగు పోటీలో వెండి పతకం గెలుచుకున్నాడు. ఆగస్టులో కరీంనగర్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో స్టీపుల్ ఛేజ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. 5000 మీటర్ల పోటీలో వెండి పతకం నెగ్గాడు.

దేశానికి ప్రాతినిధ్యం వహించాలని..



ఎడ్ల విష్ణువర్ధన్

కరీంనగర్ జిల్లాకు చెందిన ఎడ్ల శేఖర్-లావణ్య దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దేశం తరఫున ఆడాలనే లక్ష్యంతో 10,000 మీటర్ల రేస్ వాక్ సాధన చేస్తున్నాడు.

■ ఈనెల 8 నుంచి 10 వరకు అండర్-20 ఏషియన్ సెలక్షన్స్ ట్రయల్స్, జాతీయ జూనియర్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటాడు.

■ 2023 సెప్టెంబరులో వరంగల్‌లో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచాడు. నవంబరులో కోయంబత్తూరులో జరిగిన జూనియర్ నేషనల్స్ ఛాంపియన్‌షిప్‌లో అయిదో స్థానంలో నిలిచాడు.

■ 2024 జనవరిలో చెన్నైలో జరిగిన ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో.. చండీగఢ్‌లో ఓపెన్ నేషనల్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. 2024 మార్చి లఖ్‌నవూలో జరిగిన జూనియర్ జాతీయ అండర్-20 అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటాడు.

ఒలింపిక్స్‌లో ఆడటం ధ్యేయం



జి. నక్షత్ర

సిద్దిపేట జిల్లా శనిగరానికి చెందిన రామకృష్ణ-శ్రీనిధి దంపతులు కరీంనగర్ భగత్‌నగర్‌లో ఉంటున్నారు. వీరి కూతురు జి. నక్షత్ర రెండేళ్ల నుంచి 'ఈనాడు-లక్ష్య' అకాడమీలో పరుగు పందెంలో శిక్షణ పొందుతోంది. కోచ్ తిరుపతి శిక్షణలో ఎన్నో పతకాలు సాధించింది.

■ ఈనెల 17 నుంచి 19 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం సాధించింది.

■ 2024 అక్టోబరు 7, 8లలో హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ట్రయాథ్లాన్ పోటీల్లో జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలిచింది. 2024 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

■ 2023 అక్టోబరు 16న హనుమకొండలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ట్రయాథ్లాన్ పోటీల్లో కాంస్య పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించింది. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో 10 బంగారు పతకాలు, 8 రజత పతకాలు.. జిల్లా స్థాయిలో సుమారు 300 వరకు బంగారు, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టింది.

■ ఒలింపిక్స్‌లో దేశం తరఫున ఆడటం తన లక్ష్యమని పేర్కొంది.


పోరాటాల గడ్డపై సరస్వతీ పుత్రులు

ఉపకులపతులుగా సిరిసిల్ల విద్యావేత్తలు

ఈనాడు, సిరిసిల్ల

సిరిసిల్ల ప్రాంతం పోరాట యోధులనే కాదు.. సాహితీ దిగ్గజాలను.. విద్యావేత్తలను అందించింది.. ఈ ప్రాంతానికి చెందిన పలువురు విశ్వవిద్యాలయాలకు కులపతులుగా, ఉప కులపతులుగా పని చేసి విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టారు.. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన జీఎన్. శ్రీనివాస్ తాజాగా పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన నేపథ్యంలో ఈ ప్రాంతానికి చెందిన విద్యావేత్తలపై కథనం.

■ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి వేములవాడ మండలం హన్మాజిపేటలో జులై 29, 1931లో జన్మించారు. తన ప్రాథమిక విద్యను వీధి బడిలో ప్రారంభించారు. తెలుగులో పీజీ చేసిన ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. కళాశాల అధ్యాపకుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన ఓయూ, తెలుగు విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా పని చేశారు. కవి, గేయ రచయిత, సాహితీ వేత్తగా తనదైన ముద్ర వేసిన ఆయన విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీగా 1985-87 వరకు సేవలందించారు. 1989లో తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులై రెండేళ్లపాటు ఆ హోదాలో ఉన్నారు. 2017లో ఆయన కన్నుమూశారు.



సి.నారాయణరెడ్డి

సీహెచ్.హన్మంతరావు

జి.రాంరెడ్డి

జీఎన్.శ్రీనివాస్


సంకశాల మల్లేశం

■ దూరవిద్య పితామహుడు జి. రాంరెడ్డి 1929లో వేములవాడ మండలం మల్లారంలో జన్మించారు. రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేసిన ఆచార్యులుగా పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు దూరవిద్యను తీసుకురావాలని అనేక దేశాల్లోని విద్యా వ్యవస్థలపై పరిశోధనలు చేశారు. ఆయన కృషి ఫలితంగానే 1982లో మొదటిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. 1985లో ప్రారంభించిన ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి తొలి వీసీగా అయిదేళ్లపాటు పని చేశారు. దూరవిద్య కోసం ఈయన చేసిన కృషికిగాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూరవిద్య విభాగానికి రాంరెడ్డి పేరు పెట్టారు. 1991లో యూజీసీ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 1995లో లండన్‌లో మృతి చెందారు.

■ ఆర్థికవేత్త చెన్నమనేని హనుమంతరావు కోనరావుపేట మండలం నాగారంలో 1929లో జన్మించారు. దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి 1961లో ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. కేంద్ర ప్రణాళిక విభాగంలో పని చేసిన ఈయన 20 సూత్రాల సలహా కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. వ్యవసాయ అర్థశాస్త్రం, పేదరికం, ఆర్థిక సంస్కరణలు, అభివృద్ధి అంశాలపై వందకుపైగా పరిశోధన పత్రాలు, పుస్తకాలు రచించారు. 2012 నుంచి 2014 వరకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కులపతిగా పని చేశారు.

■ జిల్లాలో హన్మాజీపేట గ్రామం పేరు వినగానే డా. సి. నారాయణరెడ్డి గుర్తుకు వస్తారు. విద్యావేత్త సంకశాల మల్లేశందీ అదే గ్రామం. ఒక సాధారణ వ్యవసాయకూలీ కుటుంబం నుంచి విశ్వవిద్యాలయం వీసీ స్థాయికి ఆయన ఎదిగారు. గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన సిరిసిల్ల ఎస్సీ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. 1990లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తత్వశాస్త్రం పూర్తి చేసిన ఆయన అక్కడే ఎంఫిల్ కూడా చేశారు. జర్మనీలో పీహెచ్‌డీ చేసి పలు కళాశాలల్లో తత్వశాస్త్ర ఆచార్యుడిగా పని చేశారు. మే 24, 2021 నుంచి మే 21, 2024 వరకు కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం వీసీగా వ్యవహరించారు.

■ తాజాగా పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన జీఎన్. శ్రీనివాస్ గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందినవారు. ఈయన పదో తరగతి వరకు గంభీరావుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. కామారెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి 1995లో జేఎన్‌టీయూ నుంచి ఈఈఈలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. తాత్కాలిక అధ్యాపకుడిగా పని చేస్తూనే 1997లో ఎంటెక్ పూర్తిచేశారు. 2003లో జేఎన్‌టీయూలో అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2022లో కొంత కాలం సిరిసిల్ల జేఎన్‌టీయూ ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆచార్యులుగా, ప్రధానాచార్యులుగా, జేఎన్‌టీయూ పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా అంచెలంచెలుగా ఎదుగుతూ వీసీ స్థాయికి చేరుకున్నారు. - న్యూస్‌టుడే, గంభీరావుపేట



నిటారుగా బండ.. ఆధారం లేకుండా!

సుల్తానాబాద్ మండలం కదంబాపూర్, తొగర్రాయి గ్రామాల మధ్య ఎత్తయిన గుట్టలున్నాయి. అందులో ఒకటైన పాండవుల గుట్టపై ఓ బండరాయి ఎలాంటి ఆధారం లేకుండా ఇలా నిలబడి ఉండటం చూపరులను ఆకట్టుకుంటోంది. - ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, సుల్తానాబాద్

అపోహ వీడండి... చలామణి పెంచండి

రూ.10 నాణెం చెల్లుబాటుపై ప్రచారం

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

కొంతకాలంగా రూ.10 నాణెం చెల్లుబాటులో లేదనే అపోహలు తీవ్రమయ్యాయి. బడా వ్యాపారులతో పాటు యాచకులు సైతం నాణెం తీసుకునేందుకు నిరాకరించే పరిస్థితులు నెలకొన్నాయి. చిరిగిన నోటు తీసుకుంటున్నారు కాని నాణెం మాత్రం వద్దంటున్నారు. కొందరికి చెల్లుబాటులో ఉందని తెలిసినా.. నిరాకరిస్తున్న సంఘటనలున్నాయి. దీంతో మార్కెట్‌లో చిల్లర కొరత తీవ్రమవుతుంది. ఈ క్రమంలో ఈ నాణెం చెల్లుబాటులో ఉందని.. దీనిపై అపోహలు, దుష్ప్రచారాలు వీడి చలామణిని పెంచాలంటూ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా విస్తృత ప్రచారానికి పూనుకుంది.

బ్యాంకులో పంపిణీ..: ఇప్పటికే ఆర్‌బీఐ ముద్రించిన పోస్టర్లను నగరంలోని పలు వ్యాపార సంస్థల ముందు అంటించడంతో నాణెం వినియోగంపై అవగాహన పెంచేలా చర్యలు తీసుకున్నారు. తాజాగా యూనియన్ బ్యాంకులోని వివిధ శాఖల్లో ఈ నాణేల పంపిణీ తప్పనిసరి చేశారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని యూనియన్ బ్యాంకు శాఖలో ఇటీవల ఒక్కరోజే 50వేల రూ. 10 నాణేలను వివిధ వ్యాపార, వాణిజ్య వర్గాలకు పంపిణీ చేశారు. ఈ నాణాన్ని 2005లో ప్రవేశపెట్టగా. అప్పటినుంచి 2019 వరకు 14 సార్లు ఆర్‌బీఐ ముద్రించి మార్కెట్‌లోకి విడుదల చేసింది.



ఖాతాదారునికి రూ.10 నాణేలను పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

నాణేలకు చట్టబద్ధత: రూ.10 నాణానికి చట్టబద్ధత ఉంది. నాణెం చలామణిలో లేదనేది కేవలం అపోహ మాత్రమే. దీనిపై ఇప్పటికే ఆర్‌బీఐ పలు మార్లు స్పష్టం చేసింది. ఇప్పటికైనా వివిధ వర్గాల వారు అపోహలు వీడి.. చిల్లర కొరత తీర్చుకోవాలి.
- హిమాన్షు బారిక్, మేనేజర్, యూనియన్ బ్యాంకు, గోదావరిఖని (లక్ష్మీనగర్)

నేడు ఎల్‌ఎండీ గేట్ల ఎత్తివేత

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: మధ్యమానేరు జలాశయం నుంచి ఎల్‌ఎండీకి అధికంగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆదివారం ఉదయం 7 గంటలకు ఎల్‌ఎండీ గేట్లు ఎత్తనున్నట్లు నీటి పారుదల శాఖ ఈఈ పి. నాగభూషణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యమానేరు జలాశయం నుంచి సుమారు 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. గేట్లను ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని మానేరు నదిలోకి వదలనున్నారు. నదీ పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, రైతులు వెళ్లవద్దని కోరారు.

బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నుంచి ఎల్‌ఎండీకి శుక్రవారం నీటిని విడుదల చేశారు. జలాశయం రెండు గేట్ల నుంచి 4,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.86 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, జగిత్యాల వాణిజ్యం

సమస్య: జగిత్యాల రవీంద్రనాథ్‌ఠాగూర్ నగర్‌లో రోడ్డునిర్మాణం ఎప్పుడు చేపడతారు? **- అజయ్**


సమాధానం: రోడ్డునిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాము, త్వరలోనే క్షేత్రస్థాయి పనులను ప్రారంభించే అవకాశముంది. **- శరత్, ఏఈ**

న్యూస్‌టుడే, మల్యాల

సమస్య: తక్కళ్లపల్లి గ్రామంలో ప్రతి సీజనులో ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తుండగా ఈ సారి ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని అధికారులు రద్దు చేశారు. దీనివల్ల రైతులకు ఇబ్బందులు ఏర్పడతాయి. **-దండు అశోక్, బీజేపీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి**

సమాధానం: గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాన్ని అధికారులు రద్దు చేస్తూ సింగిల్‌విండో ద్వారా ఒకే కేంద్రం నిర్వహించాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. **- కృష్ణమోహన్, ఐకేపీ ఇన్‌ఛార్జి ఏపీఎం మల్యాల**

మహారాష్ట్ర తెలుగు అకాడమీలో జిల్లావాసుల నియామకం


శ్రీనివాస్


రవీంద్ర

ధర్మపురి, న్యూస్‌టుడే: మహారాష్ట్ర ప్రభుత్వ తెలుగు సాహిత్య అకాడమీలో సభ్యులుగా.. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన బద్దం రవి శ్రీనివాస్ నియమితులయ్యారు. ముంబయిలో నివాసముంటున్న ధర్మపురికి చెందిన ప్రముఖ కవులు, రచయితలు, సాహిత్యవేత్తలు గుండారపు శ్రీనివాస్, గొల్లపల్లి మండలవాసి రవీంద్రలకు అవకాశం కలిసింది. ఇక్కడి తెలుగువారి అభ్యున్నతికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

దారి ఇవ్వడం లేదని ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముందు డబ్బాలతో రైతులు

గొల్లపల్లి, న్యూస్‌టుడే: పొలాలలో దారి నిర్మాణానికి ఓ రైతు ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపిస్తూ.. బీబీరాజ్‌పల్లికి చెందిన పలువురు మంది డబ్బాలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన నిర్వహించారు. గతంలో డీ-64 కాలువ వెంబడి దారి కోసం తాము కొంత భూమిని ఇచ్చామని.. ప్రస్తుతం ఆ మార్గంలో వెళ్లనివ్వకుండా రైతు గంగమల్లు అతని కుమారుడు నరేశ్ అడ్డుపడుతున్నారని ఆరోపిస్తూ తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ వరందన్‌ను కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ తెలిపినట్లు పేర్కొన్నారు.

దేవాదాయశాఖ ఆర్‌జేసీ పూజలు

ధర్మపురి, న్యూస్‌టుడే: శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామక్రిష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకోగానే అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో ఆలయ ఈవో శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ప్రసాదాన్ని అందించారు.

వయోవృద్ధులకు ఆసరా

కోరుట్ల, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్(వయోవృద్ధుల) కోసం మా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆసరాగా ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కోరుట్ల డివిజన్ కేంద్రంలో వయోధికుల సంరక్షణ, పోషణ సంక్షేమ చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. హన్మంత్‌రెడ్డి, పబ్బా శివానందం, రాజ్‌మోహన్, లక్ష్మీనారాయణ, సైఫోద్దీన్, రాజయ్య, సాబితలి, శ్రీరాములు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం ఎండీ హబీబ్ కోరారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోయా బీన్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సోయాబీన్ పంటను శుభ్రపరిచి, తేమ శాతం 12 లోపు వచ్చాక కేంద్రానికి తీసుకురావాలన్నారు. పంటను దళారులకు విక్రయించి, మోసపోవద్దని కోరారు. ఏఎంసీ అధ్యక్షుడు బోరిగం రాజు, ఉపాధ్యక్షుడు ఎలాల వెంకట్‌రెడ్డి, ప్యాక్స్ అధ్యక్షుడు బద్దం గోపి, ఏవో రాజ్ కుమార్, మార్కెట్ కార్యదర్శి సురేందర్, ప్యాక్స్ సీఈవో సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక పురాణిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం-యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ చాటారు. మొదటి మూడు

ప్రతిభతో మెరిశారు.. ప్రశంస పొందారు


స్థానాలు సాధించిన విద్యార్థులు పి.గీతిక, జి.స్నేహిత, శ్రీవర్షలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు బి.రాజయ్య, రామకృష్ణ, కృష్ణయ్య, రమణాచారి, మంజులవాణి, పద్మ, స్రవంతి, విజయలక్ష్మి, కవిత, చంద్రశేఖర్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం

హిందూ ధర్మ రక్షణకు కృషి చేయాలి


కొత్తపేటలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్, న్యూస్‌టుడే: హిందూ ధర్మ రక్షణకు ప్రతి వ్యక్తి కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని సింగరావుపేట, కొత్తపేట గ్రామాల్లో భజన మందిరాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర మతాలను గౌరవిస్తూ మన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, భజనలు, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అనంతరం బోర్నపల్లి మాజీసర్పంచి ఆనందరావు, భూపతిపూర్‌లో జక్కుల లక్ష్మి మృతి చెందగా ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఎంపీడీవో బింగి చిరంజీవి, సహకార సంఘ అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి, యాదవేని రాజలింగం, కోల శ్రీను, గోపి, మోహిద్, జోగిన్‌పల్లి తిరుపతి, మరిపెల్లి శ్రీను, తదితరులున్నారు.

రాయికల్ పట్టణం: ఇతర మతాలను గౌరవిస్తూనే హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని నాగారం హనుమాన్ ఆలయం వద్ద రూ.10 లక్షల తితిదే నిధులతో భజన మందిరం నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. పుర అధ్యక్షుడు హన్మాండ్లు, ఉపాధ్యక్షురాలు రమాదేవి, రవీందర్‌రావు, మల్లారెడ్డి, పడిగెల రవీందర్‌రెడ్డి, ఎలుగందుల సత్యనారాయణ, నరేష్, లక్ష్మీనారాయణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: గతంలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని నిలిపివేయడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని, మళ్లీ కేంద్రాన్ని మంజూరు చేసేలా చూడాలని మహిళా సంఘాల సభ్యులు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్‌ను కలిసి కోరారు. మండలంలోని కోనాపూర్ గ్రామంలో కొనసాగిన సెర్ప్ కొనుగోలు కేంద్రాన్ని గత సీజన్‌లో రద్దు చేయడంతో ఇబ్బందిగా మారిందని, ప్రస్తుతం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరు చేసేలా చూస్తానని హామీచ్చారు. కోల శ్రీనివాస్, తోడేటి శేఖర్‌గౌడ్, జనార్ధన్, సొల్లు సురేందర్, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని నిరసన


రాయికల్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న హిందువులు

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలోని అమ్మవారి ప్రతిమను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలోని హిందువులు, హిందూ సంఘాల నాయకులు, అమ్మవారి భక్తులు శనివారం పట్టణలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గాంధీ చౌరస్తా నుంచి ప్రధాన వీధుల గుండా పోలీస్ ఠాణా వరకు ర్యాలీ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సై సుధీర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు.

కోరుట్ల: ముత్యాల పోచమ్మ దేవాలయంపై దాడికి పాల్పడిన వారిని కఠి


కోరుట్లలో ధర్నా చేస్తున్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సభ్యులు

నంగా శిక్షించాలంటూ శనివారం కోరుట్ల నందిచౌక్ వద్ద విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

మెట్‌పల్లి పట్టణం: హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, దాడులు పునరావృతం కాకుండా చూడాలని విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి అనంతరం కార్యాలయ అధికారినికి వినతిపత్రం అందించారు. తుక్కారాం, ప్రఖండ కార్యదర్శి మర్రి భాస్కర్, వేములవాడ రాజశేఖర్, శ్రీనివాస్, నరేష్, మోహన్, సత్యనారాయణ, రాంగోపాల్, ప్రభాకర్, విజయ్ పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి


సాన్విక

ధర్మపురి గ్రామీణం: జ్వరంతో నాగారం గ్రామానికి చెందిన చింతల సాన్విక(06) అనే చిన్నారి శుక్రవారం మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు.. సాన్విక పదిహేను రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలో పసిరికలు వచ్చాయి. దీంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. తండ్రి శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం టర్కీ వెళ్లాడు. కూతురి మరణంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

ధర్మపురి గ్రామీణం: ఓ వాహనం ఢీకొట్టడంతో బూరుగుపల్లెకు చెందిన బొమ్మకంటి రవికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు రవి తిమ్మాపూర్ బైపాస్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. రాయపట్నం వైపు నుంచి వస్తున్న ఓ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో రవికి రెండు కాళ్లు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండల కేంద్రానికి చెందిన బైరి చందన్(35) శనివారం సాయంత్రం మల్లెగుట్ట సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో 108 అంబులెన్సులో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అయిదుగురి అరెస్టు

జగిత్యాల : క్రిప్టో, బిట్‌కాయిన్ ట్రేడింగ్ యాప్‌ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నవారిపై పోలీసులు పంజా విసిరారు. అయిదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల పట్టణ సీఐ సూరం వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అధిక వడ్డీలు వస్తాయని ఆశచూపి గుమ్మిడాల నర్సయ్య, కోయాల్‌కార్ వేణు, ఆరె రాజేష్, కురెల బాబు, కొట్టె మారుతి అనే వ్యక్తులు వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని క్రిప్టో కరెన్సీ యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టించి మోసం చేస్తున్నారనే సమాచారం మేరకు విచారణ చేపట్టారు. గుమ్మిడాల నర్సయ్య జిల్లాలో యాప్‌లను ప్రారంభించి మరో నలుగురితో గొలుసుకట్టు విధానంలో పెట్టుబడులు పెట్టించి మోసాలకు పాల్పడుతున్నారని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేశామని పేర్కొన్నారు. సులభంగా, అధిక వడ్డీలు, డబ్బులు వస్తాయని యాప్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని సీఐ సూచించారు.

సేంద్రియ ఎరువు తయారు చేయండి


జగిత్యాలలో సేంద్రియ ఎరువు తయారీని పరిశీలిస్తున్న ఆర్డీ షాహిద్‌మసూద్

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: పురపాలికల్లో చెత్త నిల్వలు పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పురపాలక ప్రాంతీయ సంచాలకులు షాహిద్‌మసూద్ కమిషనర్లకు సూచించారు. జగిత్యాల పురపాలికలోని డంపు యార్డు, సేంద్రియ ఎరువుతయారీ షెడ్లు, జంతు సంరక్షణ కేంద్రాలను ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త సేకరణతోపాటు సేంద్రియ ఎరువు తయారీపై అన్ని పురపాలికలు దృష్టి నిలపాలన్నారు. పట్టణాల్లో కుక్కల బెడద నివారణకు వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలని సూచించారు. ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ కమిషనర్లు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాలు సకాలంలో చెల్లిస్తేనే ప్రయోజనం

సారంగాపూర్, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించినప్పుడే ప్రయోజనకరంగా ఉంటుందని ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ రిజిస్ట్రార్, సేల్ అధికారి వంశీకృష్ణ పేర్కొన్నారు. శనివారం సారంగాపూర్ సహకార సంఘ పరిధిలోని పాత బకాయిలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగిత్యాల, ధర్మపురి బ్యాంకుల పరిధిలోని కల్లెడ, బీర్‌పూర్, కొల్వాయి సహకార సంఘాలలో వంద శాతం రికవరీ జరిగిందని, మిగతా సారంగాపూర్‌లో రూ.18 లక్షలు, జగిత్యాలలో రూ.10 లక్షల మేర బకాయిలు పేరుకుపోయాయన్నారు. బ్యాంకు అధికారులు రాకేశ్, సీఈవో లైసెట్టి శివకుమార్, భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి


సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ వసంత తదితరులు

జగిత్యాల, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం జిల్లా భారాస కార్యాలయంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. భారాస పాలనలో సకాలంలో కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేసి వెంటదివెంట డబ్బు చెల్లించామని ప్రస్తుతం పంట చేతికి వచ్చినా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం లేదన్నారు. కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, మహాలక్ష్మి కింద ప్రతి మహిళలకు రూ.2500 పింఛన్ ఇస్తామని ప్రకటించి నోరుమెదపడం లేదని రవిశంకర్ అన్నారు. భారాస పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గట్టు సతీష్, వొల్లెం మల్లేశం, వెంకటేశ్వర్‌రావు, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ప్రవేశపెట్టిన బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు ఎఫ్‌ఎల్సీ కోట మధుసూదన్ అన్నారు. కొడిమ్యాల మండలం హిమ్మత్‌రావుపేట గ్రామంలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ బ్యాంకులో లేదా పోస్టాఫీస్‌లో ఖాతా కలిగి ఉండి 18 నుంచి 70ఏళ్ల మధ్య వయస్సు వారు ఈ బీమా పథకాలకు అర్హులని, ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం పొందితే నామినీ ఖాతాలో రూ.2 లక్షలు జమ చేస్తారని తెలిపారు. మాజీ సర్పంచి పునుగోటి కృష్ణారావు, సింగిల్విండో ఛైర్మన్ పోలు రాజేందర్, సీసీ స్వరూప, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో బీర్‌పూర్ విద్యార్థుల ప్రతిభ


ప్రణయ్

సారంగాపూర్ : జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో బీర్‌పూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 14 ఏళ్లలోపు విభాగంలో ముక్కెర ప్రణయ్ లాంగ్ జంప్ విభాగంలో వెండి పతకం సాధించి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్యామల లక్ష్మణ్ 17 ఏళ్లలోపు పరుగు పందెం, నితిన్‌కుమార్ లాంగ్ జంప్ విభాగంలో ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంఈవో సిరుప నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు సంగనబట్ల నర్సింహమూర్తి, పీఈటీ మంజుల, ఉపాధ్యాయులు అభినందించారు.

కొండగట్టుకు శాతవాహన విద్యార్థి జేఏసీ పాదయాత్ర


ఆలయం ఎదుట భారాస, విద్యార్థి జేఏసీ నాయకులు

మల్యాల, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయనున్న కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్‌కు మద్దతు ప్రకటిస్తూ శనివారం సాయంత్రం శాతవాహన విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక ఛైర్మన్ చెన్నమల్ల చైతన్య ఆధ్వర్యంలో పలువురు భారాస నాయకులు కరీంనగర్ నుంచి కొండగట్టుకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. తవుటు మురళి, మహేష్, అనిల్ గౌడ్, శ్రావణ్, రాము, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్కూలు బస్సు నడిపిన డ్రైవర్

రామన్నపేట, న్యూస్‌టుడే: మద్యం మత్తులో స్కూలు బస్సును నడపడంతో విద్యార్థులు ఆర్తనాదాలు చేయడంతో గమనించిన గ్రామస్థులు బస్సును ఆపిన సంఘటన శనివారం మల్యాల మండలం రామన్నపేట గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూలు బస్సు మద్దుట్ల గ్రామం నుంచి రామన్నపేట వచ్చే క్రమంలో బస్సు డ్రైవరు మద్యం మత్తులో అడ్డదిడ్డంగా నడుపుతుండటాన్ని గమనించిన విద్యార్థులు అరవడంతో రామన్నపేట గ్రామంలోకి చేరుకోగానే స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు బస్సును నిలిపి అందులోంచి విద్యార్థులను దింపివేశారు. అనంతరం స్కూలు యాజమాన్యానికి సమాచారం అందజేయడంతో వారు వెంటనే స్పందించి మరో డ్రైవరును పంపించి అదే బస్సులో విద్యార్థులను తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

విద్యార్థికి తీవ్రగాయం

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి చేతికి తీవ్రగాయమైనట్లు శనివారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తరి సాత్విక్ అనే విద్యార్థి 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 17న తరగతి గదిలో ఇద్దరు విద్యార్థులు నోట్‌బుక్ విషయంలో గొడవపడ్డారు. దీంతో ఓ ఉపాధ్యాయుడు వారిద్దరిని మెప్పించే క్రమంలో సాత్విక్‌ను నెట్టి వేశాడు. సాత్విక్ కుడిచేతికి గాయం కావడంతో ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలిపాడు. శుక్రవారం కోరుట్లలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా వైద్యులు పరీక్షించి చేతి ఎముకకు పగుళ్లు రావడంతో కట్టుకట్టారు. ప్రిన్సిపల్ అనిత మాట్లాడుతూ సాత్విక్ కుడిచేతికి గాయమైనట్లు తన దృష్టికి వచ్చిందని, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుడిని వివరాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.

విరిగిపడిన చెట్టు.. రాకపోకలకు అంతరాయం


చెట్టును తొలగిస్తున్న పోలీసులు

వెల్గటూరు, న్యూస్‌టుడే: మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కప్పారావుపేట, కిషన్‌రావుపేట గ్రామాల మధ్య ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై చెట్టు విరిగిపడింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు ఏమీ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. చెట్టు విరిగిపడటంతో సుమారు అరగంట సేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు.

సంక్షిప్తం

జగిత్యాల బీటులో దినుసుల కొనుగోలు

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం మక్కలకు క్వింటాలుకు రూ.1,875 నుంచి రూ.2,401 వరకు ధర పలికింది. ఎంటీయూ-1010 రకం ధాన్యం రూ.1,895 నుంచి రూ.1,905 వరకు ధరలు పలికినట్లు వివరించారు.

కళాశాలకు పంపిస్తేనే విద్యార్థులకు భవిష్యత్తు

సారంగాపూర్: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించినప్పుడే భవిష్యత్తు ఉంటుందని సారంగాపూర్ కళాశాల ప్రిన్సిపల్ వై.రమేష్ బాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బట్టపల్లి, పోతారం గ్రామాల్లో కళాశాలకు హాజరు కాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు రాజు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు–కార్యవర్గాలు

జగిత్యాల ధరూర్‌క్యాంపు: రెడ్డిసంఘాల ఐక్యవేదిక జిల్లా సమావేశాన్ని జగిత్యాల ధరూర్‌లోని రెడ్డికన్వెన్షన్‌లో శనివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు అన్నెడ మనోహర్‌రెడ్డి, కార్యదర్శి సంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నిమ్మల శేఖర్‌రెడ్డి, గూడ రమేశ్‌రెడ్డి, సుంకెట దశరథరెడ్డి, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బద్దం శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా సతీష్‌రెడ్డి, కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని కమ్మునూర్‌కు చెందిన తోట నరేందర్‌ను బీసీ జాగృతి సేన మండల ఇన్‌ఛార్జిగా నియమించారు. బీసీలు ఐక్యతతో పోరాడి, రిజర్వేషన్ వాటా సాధించుకోవాల్సిన అవసరముందన్నారు.

మెట్‌పల్లి: తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మెట్‌పల్లి మండలం కోనరావుపేటకు చెందిన మ్యాడపు సతీష్ నియమితులయ్యారు. శనివారం సతీష్‌కు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డితో కలిసి నియామక ఉత్తర్వులను అందజేశారు.

సమాఖ్య ఆమోదం లేకుండా డీఆర్‌సీసీ అప్పగించవద్దు

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లిలో పట్టణ సమాఖ్య నుంచి ఆమోదం లేకుండా ఏకపక్ష ధోరణిలో డీఆర్‌సీసీని అప్పగించడం సరికాదని వెంటనే దానిని రద్దు చేయాలని మహిళా సంఘాల ప్రతినిధులు బల్దియా ముందు ఆందోళన నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఉద్యోగి అక్షయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించి సమస్యను వివరించారు. బబ్బూరి లక్ష్మి, శ్రీలత, పద్మ, అంజన, గంగాజమున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకాగ్రత అవసరం

మెట్‌పల్లి పట్టణం: ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదివితేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని రాజారాం ట్రస్ట్ ఛైర్మన్ ప్రముఖ సైకాలజిస్టు డా.రాజరత్నాకర్ అన్నారు. శనివారం రాజరత్నాకర్-లావణ్యల జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీలోని పాఠశాల విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు పొట్ట రాజనర్సయ్య, ఉపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.

బల్దియా అనుమతులతోనే నిర్మాణం

మెట్‌పల్లి పట్టణం: పట్టణంలోని 20వ వార్డు స్వయంభూ హనుమాన్ ఆలయం వద్ద ఇంటి నిర్మాణం బల్దియా అనుమతులతోనే చేపడుతున్నట్లు శనివారం ఇంటి మద్దతు దారులు బల్దియా మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. శుక్రవారం అక్రమ నిర్మాణం అంటూ ఫిర్యాదు చేసిన వారి ఇళ్లపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

రాయికల్: రాయికల్ మండలంలోని చెర్లాకొండాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి మైతాపూర్-చెర్లాకొండాపూర్ రహదారి నిర్మాణానికి రూ.1.86 కోట్ల నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏశాల సాయిరెడ్డి, దేవుని రవి, ఆకుల గంగారెడ్డి, చిన్న నర్సయ్య, దువ్వాక నరేష్, నాగరాజు, భూపతి, హరీష్ తదితరులున్నారు.

క్రీడల్లో మండల విద్యార్థుల ప్రతిభ

రాయికల్: జిల్లా స్థాయి అండర్-14, 17 అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో రాయికల్ మండలంలోని రామాజీపేట ఉన్నత పాఠశాలకు చెందిన కుంట రమేష్ ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ, భూపతిపూర్ పాఠశాలకు చెందిన నందకిషోర్ హైజంప్‌లో ప్రథమ, ఆదర్శ పాఠశాలకు చెందిన శ్రీవర్ధన్ హైజంప్‌లో ప్రథమ, గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన రిషిందర్ హైజంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

యువకుడికి సన్మానం

మెట్‌పల్లి: ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందిన మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌కు చెందిన జంగం రంజిత్‌తో పాటు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన గోపిడి రక్షితను శనివారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన రక్షితను, ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందిన రంజిత్‌ను అభినందించారు. రాజ్‌పాల్‌రెడ్డి, ఇల్లెందుల శ్రీనివాస్, గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని రాస్తారోకో

కోరుట్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాత్రికేయుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలంటూ నిరసిస్తూ శనివారం బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మెట్‌పల్లి: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు ఉప కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మెట్‌పల్లి మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జన ఆరోగ్య సమితి సమావేశాన్ని నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామకృష్ణ తదితరులున్నారు.

విప్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మేడిపల్లి: మేడిపల్లి మండలం కొండాపూర్ సీతారామ స్వామి ఆలయం వద్ద సీసీ రహదారుల నిర్మాణానికి రూ.83 లక్షలు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. సిమెంటు రహదారుల నిర్మాణంతో ఆలయం చుట్టూ ఇబ్బందులు తీరతాయని గ్రామస్థులు పేర్కొన్నారు. ముస్కెం జలంధర్, స్వామి గౌడ్, చిట్యాల రాజేష్, దప్పు ప్రేమ్‌సాగర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల విద్యార్థులకు ఉత్తమ స్థానాలు

మెట్‌పల్లి పట్టణం : క్రమశిక్షణ గల ప్రతి విద్యార్థికి ఉత్తమ స్థానాల్లో నిలుస్తారని శ్రీసూర్యోదయ హైస్కూల్ కరస్పాండెంట్ దొంతుల రాజ్‌కుమార్ అన్నారు. డీఎస్సీ ఫలితాల్లో 5వ, 16వ ర్యాంకులు సాధించి, ఉపాధ్యాయులుగా నియమితులైన పాఠశాల పూర్వ విద్యార్థులైనా గంగుల శివ, తస్మియలను పాఠశాల బృందం సన్మానించి అభినందించారు. డైరెక్టర్ చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, ప్రిన్సిపల్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి విద్యుత్తు శాఖ డీఈ బదిలీ

మెట్‌పల్లి: మెట్‌పల్లి డివిజన్ విద్యుత్తు శాఖ డీఈ తిరుపతి బదిలీ అయ్యారు. ఆయనను నర్సంపేటకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో జగిత్యాల సర్కిల్‌లో టెక్నికల్ డీఈగా పనిచేస్తున్న గంగారాంకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. బదిలీపై వెళ్తున్న తిరుపతిని డివిజన్ కార్యాలయ సిబ్బంది కె.ప్రసాద్, రాజశేఖర్, నవీన్, కరీం తదితరులు సన్మానించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గొల్లపల్లి: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు గొల్లపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను సీఐ నర్సింగరావు శనివారం నిర్వహించారు. 16 జట్లు పాల్గొనగా.. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్సైలు సతీష్, శ్రీధర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాలు

వెల్గటూరు: ఎండపల్లి, వెల్గటూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం ఈ సమావేశాలు జరపాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా విద్యార్థుల హాజరు, ప్రగతి, పరీక్ష ఫలితాలు వంటి విషయాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమీక్షించారు.

హెచ్ఐవీపై అవగాహన

జగిత్యాల పట్టణం: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హెచ్ఐవీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.రవీందర్ ఎయిడ్స్ వ్యాప్తికి కారణాలు, నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. తిరుపతిరెడ్డి, తిరుపతి, సునిత, శ్రీలత, శిల్ప, స్వరూప పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై..

జగిత్యాల వ్యవసాయం: ఉద్యానశాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు చేసే జిల్లాలోని రైతులకు జగిత్యాలలో శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ రాయితీపై జిల్లా అధికారి దేవప్రసాద్, సీఈవో సిద్ధాంత్, డివిజన్ అధికారిణి స్వాతి, సాగులో యాజమాన్యాన్ని గూర్చి సాంకేతిక సలహాదారు వై.ఎస్.రంగనాయకులు రైతులకు వివరించారు. హెచ్ఈవో అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులో వెళ్లిన ఆర్డీవో

జగిత్యాల: జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్ సెలవులో వెళ్లారు. వ్యక్తిగత పనిపై వారంరోజులు సెలవులో వెళ్లేందుకు అనుమతి లభించింది. తిరిగి ఈనెల 28న విధుల్లో చేరుతారు. అప్పటి వరకు కోరుట్ల ఆర్డీవో ఎన్.శ్రీనివాస్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు.